

జనగామ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

## జనగామలో బీజేపీ నిరసన.. ఉద్రిక్తం

- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. పోలీసుల అడ్డగింత
- నాయకులు, పోలీసుల నడుమ తోపులాటతో గందరగోళం

జనగామ, జనవరి 7(నమస్తే తెలంగాణ) : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని నిరసిస్తూ జిల్లాకేంద్రంలో ఆ పార్టీ నాయకులు తలపెట్టిన నిరసన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం సాయంత్రం జనగామ చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలీసుల నడుమ తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గూండాలతో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం సిగ్గుచేటని, దేశవ్యాప్తంగా కేవలం మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తే బీజేపీ 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, మేం తలుచుకుంటే హైదరాబాద్‌లోని గాంధీభవన్‌ను పునాది రాళ్లతో సహా లేపేస్తాం అని హెచ్చరించారు. 'తీవ్రవాదులను, నక్సలైట్లను ఎదుర్కొని నిలిచిన పార్టీ మాది.. మీలాంటి చిల్లర రౌడీలు, వీధి గూండాలకు భయపడే ప్రసక్తే లేదు.. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి' అని హెచ్చరించారు.

## క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అభినాష్



మాట్లాడుతున్న కొత్తపల్లి అభినాష్

జనగామ, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అభినాష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ మణ, పైళ్ల ఆశయ్య ప్రకటించారు. అధ్యక్షుడిగా ప్రసాదం విష్ణు, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి అభినాష్ (జనగామ కేసీఆర్ సెలూన్), ప్రధాన కార్యదర్శిగా చెన్నారం మల్లేశ్, సహాయ కార్యదర్శిగా దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షులుగా జంపాల మనోహర్, జీ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలిగా ఉమారాణి, సహాయ కార్యదర్శిగా హరితను ఎన్నుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెలూన్లకు అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని, ట్రాన్స్‌కోకు బకాయిలు చెల్లించాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నవీన సెలూన్ల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిరుపేద నాయీ బ్రాహ్మణులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది.

## పైరవీకారుల ఇష్టారాజ్యంపై ఖాతాదారుల నిరసన

దేవరుప్పుల, జనవరి 7: స్థానిక యూనియన్ బ్యాంకులో పైరవీకారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఖాతాదారులు వాపోయారు. ఈ విషయమై మంగళవారం పలువురు బ్రాంచి మేనేజర్‌ను నిలదీశారు. రైతులు రుణమాఫీ విషయంలో పైరవీ ఉంటేనే ఫైల్ కదులుతున్నదని ఆరోపించారు. మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసి నెలలు గడిచినా ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదన్నారు. ఖాతాదారులకు గౌరవం ఇవ్వడం లేదని, జవాబుతనం కొరవడిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలువురు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు శ్రీరాం, రెడ్డిరాజుల రమేశ్, కాసారపు ధర్మారెడ్డి, బోనగిరి యాకస్వామి, ఇనుమలు నాగరాజు, భూక్యా సజ్జన్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

రఘునాథపల్లి, జనవరి 7: మండలంలోని రామరాయినిబంగ్లాకు చెందిన మందెల మల్లమ్మ (50) అనారోగ్యం తో మంగళవారం మృతి చెం దారు. సమాచారం తెలుసుకు న్న మాజీ సర్పంచ్ బక్క యా దగిరి మృతురాలి కుటుంబా న్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మారబోజు కనకరాజు, గంధం సత్యనారాయణ, అంజ నేయులు, సాదం కుమారస్వామి, మద్దెల కర్నాకర్, మల్లేశ్, మడుపు చిన్న స్వామి, ఆరూరి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME & ADDRESS**

★I, BETHI SAMPATH (old Name), R/O.H.No.2-65, Kondaparthy, Hanamkonda, Warangal, T.S. Have changed My Name & Address as BETHI SAMPATH REDDY (New-Name), R/o. H.No. 24-4-268/A/15, Darga Kazipet, Kazipet Mandal, Hanumakonda Dist. T.S. (New Address).

NTW-000

**CHANGE OF NAME**

I, POLEPALLY SANTHOSH REDDY S/o NARAYANA REDDY (New Name) R/o H.No. 9-44/6/1, Malkapur Village, Chilpur Mandal, Jangaon District-506145.TG. I have changed my name from POLEPELLY SANTOSH REDDY to POLEPALLY SANTHOSH REDDY Both Names are one and Same person.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**WANTED TELECALLERS**

jobs Apply Now!

★ URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVES JOB LOCATION: HANAMKONDA, CONTACT: +91 9398286149.

NTW-7708

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565


# రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

**వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య**




జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న ఏసీపీ అంబటి నర్సయ్య



బచ్చన్నపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై హమీద్

జఫర్‌గఢ్, జనవరి 7 : రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. నర్సయ్య మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కోరారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. కార్లు, ఇతర వాహనాలు నడిపేవారు తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఏసీపీ సూచించారు. ఈ కార్యక్రమం లో సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై రామ్‌చరణ్‌నాయక్ పాల్గొన్నారు.

**పాలకుర్తిలో..**

పాలకుర్తి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందాలంటే హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. వాహనదారులకు ఇది రక్షణ కవచం లాంటిదన్నారు. అనంతరం వాహనదారులకు గులాబీలు ఇచ్చి హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మేకల లింగారెడ్డి, ఏఎస్సై రాజిరెడ్డి, కానిస్టేబుల్ వాకిడి రాజుకుమార్ పాల్గొన్నారు.

**బచ్చన్నపేటలో..**

బచ్చన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ఎస్‌కే హమీద్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని కూడళ్లలో ఆయన అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ తిరుపతిరెడ్డి, జమాలుద్దీన్ పాల్గొన్నారు.

**దేవరుప్పులలో..**

దేవరుప్పుల : వాహనచోదకులు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై సృజన్‌కుమార్ అన్నారు. మండలంలోని కామారెడ్డిగూడెంలో వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనచోదకులకు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండాలన్నారు. ఏఎస్సై సదానందం,కానిస్టేబుల్ అశోక్, యాకన్న, మహిళా కానిస్టేబుల్ సమత పాల్గొన్నారు.

## అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిరావాలి

**డీసీపీ రాజమహేంద్రనాయక్**



చిన్నయ్యకు సరుకులు ఇస్తున్న రాజమహేంద్రనాయక్

లింగాలఘనపురం, జనవరి 7 : పోరుబాట పట్టిన నక్సల్స్ అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసి రావాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నెల్లుట్ల వడ్డెర కాలనీకి చెందిన అజ్ఞాత నక్సలైట్ పందిపోటు శారద కుటుంబానికి సంక్రాంతి పండగను పురస్కరించుకుని నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, నగదును అందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలిసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోందన్నారు. వారికి ప్రకటించిన రివార్డును సైతం నేరుగా అందిస్తామన్నారు. శారద తండ్రి చిన్నయ్య భార్య యాదమ్మ మృతి చెందగా సోదరి సాయమ్మ తోడుగా ఉంటోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శారద సేవలు కుటుంబానికి ఎంతో అవసరమన్నారు. శారద జన జీవన స్రవంతిలో కలిసి కు టుంబానికి ఆసరాగా నిలువాలన్నారు. శారదకు ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డును ప్రకటించిందని, ఆమె సరెండ్ అయి తే ఈ డబ్బులు నేరుగా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌బీ ఏసీపీ పార్థసారథి, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఆర్‌ఎస్సై నర్సింగరావు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు

దేవరుప్పుల, జనవరి 7: యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లి, దేవరుప్పులలో ఎరువుల దుకాణాలను ఏడీఏ పరుశరాంనాయక్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయాధికారి దివ్య, ఏఈవోలు సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న డీఏవో

## హైదరాబాద్‌లో లక్ష డప్పులతో మహాప్రదర్శన

లింగాలఘనపురం, జనవరి 7 : ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో వచ్చే నెల7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పుల మహా ప్రదర్శనకు మాదిగలంతా తరలిరావాలని సంఘం నాయకులు కోరారు. మండలంలోని నెల్లుట్లలో మంగళవారం రాత్రి దండోరా కళామండలి నేతృత్వంలో డప్పు ప్రదర్శన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టగల్ల సంజీవ, ప్రతాప్, పరశురాములు, రాగల్ల ఉపేందర్, గడ్డం యాదగిరి, కడారి శ్రీను, నల్ల అంజనేయులు, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందేలా డాక్టర్లు కృషి చేయాలి

**జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు**



రికార్డులు పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రావు

బచ్చన్నపేట, జనవరి 7: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యాధికారి నుంచి సిబ్బంది వరకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మల్లికార్జున్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దవాఖానలోని రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని వ్యాధులు సోకే అవకాశం ఉందని, గ్రామాల్లో ఏఎన్‌ఎంలు పరిశీలించాలన్నారు. గర్భిణులు, పిల్లలకు సేవలందించడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రతి రోజూ రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించాలని, 24 గంటలు వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి సృజన, సిద్ది సుదర్శన్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా కొనసాగించాలి



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న స్వరూపారాణి

పాలకుర్తి, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్ స్వరూపారాణి అన్నారు. మంగళవారం మండలంలోని గూడూరులో జీపీ రికార్డులను, పాలకుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 95 శాతం పూర్తయిందన్నారు. పాలకుర్తి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 16,598 దరఖాస్తులు వచ్చాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శులు వెంకటాచారి, శ్రీకాంత్, లింగయ్య ఉన్నారు.

## మల్కాపూర్ ఊర చెరువుకు సాగు నీరందించాలని వినతి

చిల్పూరు,జనవరి 7 : మండలంలోని మల్కాపూర్ చెరువుకు గోదావరి జలాలు అదించాలని మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని పలువురు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లింగంపల్లి మైసమ్మ చెరువు నుంచి మల్కాపూర్ ఊర చెరువును నింపితే సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి రంజిత్‌రెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, పసుల వెంకటేశ్, ఊరడి సతీశ్, నామాల మల్లేశ్, పెనుకుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జనగామ చౌరస్తా, జనవరి 7 : ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ధరణి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తుల్లోని మ్యుటేషన్, పీవోబీ, సక్సెషన్, కోర్టు కేసులు, టీఎం 33 మాడ్యూల్స్‌ల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. వీటికి సంబంధించిన రికార్డులను పరిశీలించాలని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫీల్డ్ పొజిషన్ నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, కలెక్టరేట్ ఏవో మన్సూరి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలతో నూతన ఆవిష్కరణలు



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, జనవరి 7 : భవిష్యత్ కాలమంతా సైన్స్‌దే అని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డు మార్గంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ షెల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్‌ఎక్స్ కార్నర్ విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల (స్టెమ్ ల్యాబ్)ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగ ఆవిష్కరణలను పరిశీలించి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల ద్వారా నూతన ఆవిష్కరణలు చేసే అవకాశం విద్యార్థులకు లభిస్తుందన్నారు. సైన్స్ ద్వారా మానవాళి మనుగడకు అవసరమైన ప్రయోగాలు చేసి సరికొత్త ఆవిష్కరణలు చేయొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సునంద, పాఠశాల హెచ్‌ఎం వీ కృష్ణమూర్తి, ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో నర్సింహరావు, జీసీడీవో గౌసియా బేగం, సైన్స్ ఆఫీసర్ ఉపేందర్, ఎంఈవో రాజేందర్, హెచ్‌ఎం రమేశ్, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచాలి

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి**

పాలకుర్తి : దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల రైతాంగానికి దేవాదుల ద్వారా సాగు నీరు అందించాలన్నారు. నీటి విడుదలలో సమస్యలుంటే తనకు సమాచారం అందించాలన్నారు. దేవాదుల 4ఎల్ కేనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. రిజర్వాయర్ల పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. సమావేశంలో ఐబీ ఈఈ ప్రవీణ్, డీఈఈ శ్రీకాంత్ శర్మ, ఏఈలు ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, ధరావత్ సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు సంక్షేమ పథకాలు అమలు**

దేవరుప్పుల : రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మి పథకంలో 60 మంది లబ్ధిదారులకు ఆమె చెక్కులను పంపిణీ చేశారు. యశస్వినీరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలోని రైతుల పంట రుణాల మాఫీకి రూ. 21 వేల కోట్లు వెచ్చించామన్నారు. మిగిలిన వారికి త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. అనంతరం సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో విద్యార్థి బబ్బూరి మహేశ్ విజేతగా నిలిచినందుకు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి సత్కరించారు. ఎంపీవో సురేశ్‌కుమార్, నాయకులు శ్రీరాం, సురేశ్‌బాబు, రెడ్డిరాజుల రమేశ్, కాసారపు ధర్మారెడ్డి, గులాం రసూల్, ఇనుముల నాగరాజు, మొలుగూరి రమేశ్, పులిగిల్ల వెంకన్న, బోనగిరి యాకస్వామి, రతన్, రాంచందర్‌నాయక్, ఆకవరం రవీందర్‌రెడ్డి, నర్సింహులు ఉన్నారు.

**గురుకులంలో స్టీమ్ ల్యాబ్ ప్రారంభం**

కొడకండ్ల : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో జెసీ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎక్స్- కార్నర్ స్టీమ్ ల్యాబ్‌ను మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ అధ్యక్షతన స్మైల్ ఫౌండేషన్ వారి సహకారంతో షెల్ కంపెనీ వారి ఆర్థిక సౌజన్యంతో స్టీమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడంలో కృషి చేయాలని యశస్వినీరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేశ్, స్మైల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ కిశోర్, ఎమ్‌వో శ్రీనివాస్, డీజీఆర్‌వో గౌసియా బేగం, సీఎంవో నర్సింహరావు, డీఎస్‌ఓ ఉపేందర్, ఎంఈవో క్రేజీయారాణి, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాలి


స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 7 : అవసరం ఉన్న చోట వసతి గృహాల మరమ్మతులను వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహంతో పాటు బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. సముద్రాలలోని నర్సరీని, వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. జీపీ రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. హాస్టల్ వార్డెన్ మహేందర్, ఎంపీడీవో విజయశ్రీ, పీఆర్ డీఈ రాజగోపాల్ రావు, ఏఈ రామకృష్ణ రావు, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, ఈజీఎస్ ఏపీవో ప్రేమయ్య, టీఏ జాంబ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న పింకేశ్‌కుమార్

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు**



లబ్ధిదారుడికి చెక్కును ఇస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పాలకుర్తి, జనవరి 7: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని వావిలాలకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహంకాళి శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎంఆర్‌ఎఫ్‌లో రూ.50 వేల చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజా సేవ తమ లక్ష్యమన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆధైర్య పడొద్దని, అందరికీ అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట, జనవరి 7: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పుష్పకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9,10 తరగతుల్లో ఖాళీలకు గాను అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో వచ్చే 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూస్ విద్యార్థులకు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 చెల్లించి దరఖాస్తు చేయాలని ఆమె కోరారు.

## బంధగీ సమాధి వద్ద ఎమ్మెల్యే శ్రద్ధాంజలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పుల, జనవరి 7: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు షేక్ బందగీ 85వ ఉర్సు ముబారక్ సందర్భంగా మండలంలోని కామారెడ్డిగూడెంలోని బందగీ సమాధి వద్ద పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. ప్రతి సంవత్సరం 6వ రజ్జబ్ 446మ హిజిరీ రోజు బందగీ వారసులు గ్రామంలోని ముస్లిం సోదరులు కలిసి వర్ధంతితోపాటు ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట్లాడుతూ పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ధీశాలి బంధగీ అన్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు ఇనాయత్ రసూల్, బందగీ వారసులు సాబీర్ అలీ, వాజిద్ అలీ, రాహూల్ కుద్దూస్, జకీర్ హుస్సేన్, గులాం రసూల్, మహ్మద్ జాకీర్, షబ్బీర్, అక్రమ్, మహ్మద్ అబ్బాస్, మౌలానా, అజ్మతుల్లా, రబ్బానీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ

బచ్చన్నపేట, జనవరి 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఆదిరెడ్డి అకాడమీ ట్రస్ట్ చైర్మన్ కల్నల్ డాక్టర్ నరేందర్‌రెడ్డి నేతృత్వంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంఈవో ఇర్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం అందిస్తానన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిల్పూరు, జనవరి 7 : మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన పల్లపు శ్రీనివాస్ మనుమడు రిత్విక్ అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో సీఎంఆర్‌ఎఫ్‌లో రూ.50 వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే కడియం శ్రీహరి లబ్ధిదారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు రంగు రమేశ్, మామిడాల లింగారెడ్డి, తాళ్లపెల్లి సంపత్‌కుమార్, తాళ్లపల్లి రాజ్‌కుమార్, కొత్తపల్లి యాకరాజ్, రామగుండం బుచ్చికొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మంపేట లబ్ధిదారులకు ..**

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేటకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం పంపిణీ చేశారు. హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తిమ్మంపేటకు చెందిన సింగిరెడ్డి ఉమారాణికి.రూ .60 వేలు, పెండ్లి కర్ణాకర్‌కు రూ.22 వేల చెక్కును ఆయన అందజేశారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

## చిరు వ్యాపారులకు వెండర్స్ కార్డులివ్వాలి

జనగామ చౌరస్తా, జనవరి 7 : జనగామ పట్టణంలోని చిరు వ్యాపారులను గుర్తించి మున్సిపల్ అధికారులు వెండర్స్ కార్డులు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. విజేందర్ మాట్లాడుతూ ఆర్టీసీ చౌరస్తా నుంచి నెహ్రూపార్కు మీదుగా రైల్వే స్టేషన్ వరకు రోడ్లపై పండ్లు, కూరగాయలు, సోడాబండి, తోపుడు బండ్లతో చిరు వ్యాపారం చేసుకునే వారిని అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణల పేరిట ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. చిరు వ్యాపారుల కోసం హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం కన్వీనర్ మెండె రమేశ్, కో కన్వీనర్ శంకర్, రమ్య, పద్మ, దానమ్మ, లక్ష్మి, బాలకృష్ణ, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ చౌరస్తా, జనవరి 7 : క్రిస్టియన్, మైనార్టీ మహిళలు ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో ఉచితంగా కుట్టు మిషన్లు పొందడానికి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి, జనవరి 7: రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుసుంబాయి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రామన్నగూడేనికి చెందిన మరాటి యాదగిరి (56) రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యాదగిరి కూలి పనులు చేసేవాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం జీఆర్పీ పోలీసులు జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించి కే సు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.